# సత్యవాక్యం


# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MARCH - 2004

క్రీస్తు సందేశములను ప్రసారింపచేస్తున్న

TEJA TV




MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్లో**

ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

కాకినాడలో మాత్రమే చూడండి.

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వివరించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH


P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

Joshua Gootam


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — మార్చి 2004 — సంచిక 8


## క్రైస్తవులు - పాతనిబంధన - 2

(Christians and Old Testament)

క్రైస్తవులు క్రొత్త నిబంధనను బట్టి పరిపాలింపబడవలెనని, వారు పాత నిబంధనను సరింపరాదని మనము ఇంత వరకు నేర్చుకొని యున్నాము. పాత, క్రొత్త నిబంధనలు రెండును దేవుని వాక్యమే అయినను, ఒక చట్టమువలె పాత నిబంధన ఇప్పుడు అమలులో లేదని మనము గ్రహించితిమి. అయితే క్రైస్తవుల కది ఎట్లు పయోగపడును? అని మీరు ప్రశ్నింప వచ్చును. పాతనిబంధనను చదువుట ద్వారా పూర్వకాలమందు దేవుడు తన చిత్తము నెట్లు బయలుపరచెనో మనము తెలిసికొనగలము. దేవుని యొక్క వ్యక్తిత్వ మును గూర్చియు, జగత్సృష్టిని గూర్చియు, దానిని చదువుట ద్వారా మానవపతనమును గూర్చియు మనము తెలిసికొనగలము. అంతేకాదు దేవుడు నీతిని, విధేయతను ప్రేమించి, అవినీతిని అవిధేయతను ద్వేషించువాడు అని మనకది బోధించును. దేవుడు తనకొరకు ఏర్పరచుకొనినవారు అవిధేయత చూపగా వారిని శిక్షించెను. "అందువలన మనము ప్రభువును శోధింపకయుందము;

వారిలో కొందరు శోధించి సర్పముల వలన నశించిరి............ ఈ సంగతులు దృష్టాంతము లుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" అని 1 కొరింధి 10:9-10లో అపో.పౌలు చెప్పుచున్నాడు. మరల రోమా 15:4లో ఓర్పు వలనను, లేఖనముల వలన ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగు టకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవని అతడు మరల వ్రాసెను. గనుక మన పూర్వీకులు ఆశించినట్లు చెడ్డవాటిని మనము ఆశింపక యుండునట్లును, మనకు బోధ కలుగుటకును, బుద్ధి కలుగుటకును పాత నిబంధన వ్రాయబడెను. ఒక చట్టము వలె అది ఏలుబడి చేయుట లేదుగాని అందు దేవుడు నెలకొల్పిన నిత్యసూత్రములనేకములున్నవి.

క్రైస్తవులు పాతనిబంధన ఏలుబడిలో లేరు అను ఈ అంశమును ఈరోజు మరికొంత ఆలోచించి ముగించుదాం. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో 6వ అధ్యాయము నుండి 10వ అధ్యాయము 9వ వచనము వరకు పౌలు తర్కించిన అంశమును ఈరోజు గమనించుదాం.

హెబ్రీ 6:12లో విశ్వాసము చేతను, ఓర్పు చేతను వాగ్దానములను స్వతంత్రించుకొను వారిని గూర్చి పౌలు వ్రాసెను. ఆ వాగ్దానము దేవుడు అబ్రాహామునకు చేసెను (6:13). వాగ్దానమును దేవుడు ప్రమాణము చేసి దృఢపరచెను (6:17). ఆ వాగ్దాన ప్రతిఫలముగా నిరంతరము మెల్కీసెదెకు క్రమము చొప్పున ప్రధాన యాజకుడైన యేసు మనకనుగ్రహింపబడెను. ఆయన పరలోకమందు మనకంటె ముందుగా మన పక్షమున ప్రవేశించెను (6:20).

హెబ్రీ 7:1-10లో మెల్కీ సెదెకు యొక్క యాజక ధర్మము వర్ణించ బడినది. అది ధర్మశాస్త్రమును బట్టి వచ్చినదికాదు. లేవీయులు యాజకులై యుండగా ప్రజలకు ధర్మశాస్త్ర మీయబడెను. గాని ఆ యాజకుల వలన సంపూర్ణ సిద్ధి కలుగలేదు. ఏలయనగా ఒక యాజకుడు మరణించగా వేరొకడు నియమింపబడవలసి వచ్చెను (7:23).

మోషే ధర్మశాస్త్రము బట్టి లేవీ గోత్రము నుండి ఎన్నుకొన బడినవారు యాజకులుగా పనిచేసిరి. వారిని మోషే ద్వారా దేవుడు నియమించెను. గాని యేసుక్రీస్తు లేవీ గోత్రీయుడు గాక యూదా గోత్రము నుండి వచ్చినవాడు. ఆ యూదా గోత్ర విషయములో యాజకులను గూర్చి మోషే యేమియు చెప్పలేదు (7:14). అయితే యేసు క్రీస్తును

దేవుడు మన ప్రధాన యాజకునిగా చేసెను. కాని మోషే ధర్మశాస్త్ర ప్రకారము యేసు క్రీస్తు యాజకుడు కానేరడు. ఏలయనగా ఆయన లేవీయుడు గాక యూదా గోత్రములో పుట్టినవాడు. అయితే యాజకుడు మార్చబడినందున యాజక ధర్మము మార్చబడవలసిన ఆవశ్యకత యేర్పడెను. అందువలన ముందియ్యబడిన ఆజ్ఞ (అనగా మోషే ధర్మశాస్త్రము) నివారణ చేయబడెను (7:18). మూడు కారణముల వలన అది నివారణ చేయబడెను. అది దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు. అది బలహీనమైనది. అది నిష్ ప్రయోజనమైనది అది నివారణ చేయబడిన తరువాత దానికంటె శ్రేష్టమైన నిరీక్షణ దాని వెంట ప్రవేశపెట్టబడెను. ఆ శ్రేష్టమైన నిరీక్షణ ద్వారా దేవుని యొద్దకు మనము చేరుచున్నాము (7:19).

మోషే ధర్మశాస్త్రము మంచిదై యుంటే, క్రీస్తు ధర్మశాస్త్రము దానికంటె శ్రేష్టమైనదని పౌలు బోధించుచున్నాడు. క్రైస్తవులు ఈ శ్రేష్టమైన నిరీక్షణ ద్వారా దేవుని యొద్దకు చేరుదురు. మరియు ప్రమాణము లేకుండ యేసు యాజకుడు కాలేదు గనుక ఆయన మరి శ్రేష్టమైన నిబంధనకు పూట కాపాయెను (7:22). మరియు లేవీ యాజకులు మరణము పొందుటచేత ఎల్లప్పుడును ఉండ సాధ్యము కానందున అనేకులైరి గాని యేసుక్రీస్తు నిరంతరము ఉన్నవాడు గనుక మార్పులేని యాజకత్వము కలిగిన వాడాయెను (7:24). ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యు న్నాడు (7:25).

యేసుక్రీస్తు ఇప్పుడు మన ప్రధాన యాజకుడై యున్నాడు (8:1). అందువలన పరిశుద్ధాలయమునకు ఆయన పరిచార కుడై యున్నాడు. దానిని మనుష్యుడు కాక ప్రభువే స్థాపించెను (8:2). లేవీ యాజకులైతే పరలోక సంబంధమగు వస్తువుల ఛాయ రూపకమైన గుడారము నందు సేవ చేసిరి (8:5). యేసుక్రీస్తు శ్రేష్టమైన నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు; అది యెక్కువైన వాగ్దానములను బట్టి నియమింపబడెను గనుక ఆయన సేవ కత్వము ఉత్కృష్టమైనది (8:6).

ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశ ముండ నేరదు (8:7). దేవుడు చేసిన క్రొత్త నిబంధన మొదటి దానివంటిది కాదు (7:9). ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటి దానిని పాతదిగా చేసి యున్నాడు

(8:13). ఏది పాతగిలి ఉడిగిపోయెనో అది అదృశ్యమాయె నని చెప్పుచూ హెబ్రీ 8వ అధ్యాయమును పౌలు ముగించెను.

9వ అధ్యాయములోని మొదటి 5వ వచనములలో మొదటి నిబంధనలోని అనేక సంగతుల నెత్తి చూపించుచు అవి అదృశ్యమాయెనని అతడు చెప్పెను. పాత నిబంధన యందు సేవా నియమములు, ఈలోక సంబంధమైన పరిశుద్ధ స్థలము, గుడారము, అందులో దీప స్థంభమును, బల్లయు, దానిమీద ఉంచబడిన రొట్టెలు ఉండెను. రెండవ తెరకు ఆవల సువర్ణ ధూపార్తియు, నిబంధన మందసమును, మందసములో మన్నాగల బంగారు పాత్ర యు, చిగిరించిన అహరోను చేతి కర్రయు, నిబంధన పలకలు, కరుణా పీఠము, కెరూ బులుండెను. జంతు రక్తము మొదటి నిబంధనలో అర్పింపబడు చుండెను.

మొదటి గుడారము ఆ కాలమునకు ఉపమానార్ధముగ నుండెను. అందు అర్పిం పబడిన అర్పణలు, బలులు ఆరాధకుని కి సంపూర్ణ సిద్ధి కలుగజేయలేక పోయెను. ఏలయనగా అవన్నియును శరీరా చారము లు మాత్రమే (9:9-10). అయితే దిద్దు బాటు కాలము వచ్చువరకు ఇవి కొన సాగింపబడెను.

యేసుక్రీస్తు హస్తకృతము కాని దియు, ఈ సృష్టి సంబంధము కాని దియు, మరి ఘనమైనదియు నైన గుడార మునకు ప్రధాన యాజకుడాయెను (9:11). జంతువుల రక్తముతో కాక ఆయన తన స్వరక్తముతో పరిశుద్ధ స్థలములో ప్రవే శించెను (9:12). యేసు క్రీస్తు రక్తము జంతువుల రక్తము కంటె ఎంతో శ్రేష్టమైనది. అది పాపములను కడిగి పవిత్రము చేయును (9:13, 14).

యేసుక్రీస్తు క్రొత్త నిబంధనకు మధ్య వర్తియై యున్నాడు. ఆయన మరణము వలన మొదటి కాలములో జరిగిన అపరాధ ములకు విమోచనము దొరికెను (9:15). అయితే క్రొత్త నిబంధన ఆయన జీవించి యుండగా అమలులోనికి రాలేదు. ఏలయ నగా మరణశాసన మెక్కడ ఉండునో అక్కడ దానిని వ్రాసినవాని మరణము ఆవశ్యము. అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనా చెల్లునా? (9:16, 17).

మోషే ద్వారా కల్గిన ధర్మశాస్త్రము రక్తము ద్వారా ప్రతిష్టింపబడెను. ప్రతి ఆజ్ఞను మొదట ప్రజలతో చెప్పిన తరువాత రక్తము చే అతడు దానిని ప్రోక్షించెను. ఆ ధర్మశాస్త్ర మందు పరలోక సంగతులను పోలినవి మాత్రమే యుండెను. అవి జంతువుల రక్తముచేత శుద్ధీకరింపబడెను. గాని పరలోక సంబంధమైనవి వీటికంటె శ్రేష్టమైన బలుల

వలన శుద్ధి చేయబడవలసి యుండెను (9:18-23).

యేసుక్రీస్తు మనకొరకు దేవుని సముఖ మందు కనబడుటకు పరలోక మందు తన స్వరక్తముతో ప్రవేశించెను. ఆయన మనందరి పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడెను (9:28).

మోషే ద్వారా కలిగిన ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలులు ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలది కాదు. దాని ప్రకారమున్న అర్పణలు, బలులు ఆరాధకుని పరిపూర్ణునిగా చేయలేక పోయెను (10:1). ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము (10:4). నిజానికి ధర్మశాస్త్రము చొప్పున అర్పింపబడిన బలులు, అర్పణలు, హోమములు, పాప పరిహారార్థ బలులు దేవుని కిష్టమైనవి కావు (10:5-8). అందు వలన దేవుడు ఆ రెండవ దానిని అనగా క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు మొదటి దానిని అనగా పాత నిబంధనను కొట్టి వేసెను (10:9).

గనుక ఇప్పుడు దేవుని కుమారుడును, మన ప్రధాన యాజకుడైన యేసునందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడగును. కుమారునికి విధేయుడు కాని వాడు జీవము చూడడు కాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచియుండును (యోహాను 3:36).

యేసుక్రీస్తు సంపూర్ణ సిద్ధి పొందినవాడై మెల్కీసెదెకు యొక్క క్రమములో చేరిన ప్రధాన యాజకుడని దేవునిచేత పిలువబడి, తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9-10). ఆయన అర్పించు నిత్యరక్షణలో ప్రవేశించవలెనంటే ఆయన ఆజ్ఞలకు ఈనాడే నీవు లోబడుట అత్యవసరము.

- జాషువా గూటం

★ SATYAVANI ★ CHURCH OF CHRIST

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **'సత్యవాణి'** టి.వి. కార్యక్రమములను

ప్రతి **మంగళవారం** ఉదయం 6:30 గం॥లకు **మాటి.వి.** లోను మరియు

ప్రతి **శనివారం** ఉదయం 6:30 గం॥లకు **తేజ** ఛానల్ లోను చూడండి.

★ SATYAVANI ★ CHURCH OF CHRIST

ఉపమానమాలిక : 

# నిష్ఫలమైన అంజూరపు చెట్టు

*(The Barren Fig Tree)*

**లూకా 13:6-9**

పాపులైన వారి మీదికే ప్రమాదములు విపత్తులు వచ్చి పడతాయని యూదులు తలంచేవారు. పిలాతు గలిలయులైన కొందరి రక్తాన్ని వారి బలులతో కలిపాడు. మరియు సిలోయములోని గోపురము కూలి పదునెనిమిది మంది చనిపోయారు. వారు పాపులైనందు వలననే అట్టి విపత్తు వారికి సంభవించెనని యూదుల తలంచుచు యుంటే యేసు ప్రభువు "వారు మీ అందరికంటే పాపులని తలంచుచున్నారా? కారని మీతో చెప్పుచున్నాను. మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురని" బోధించారు (లూకా 13:1-5). ఈ సంగతిని వారు మరింత గ్రహించులాగున లూకా 13:6-9లో ఆయన వారికి ఉపమానాన్ని బోధించారు.

"ఒక మనుష్యుని ద్రాక్ష తోటలో అంజూరపు చెట్టొకటి నాటబడి యుండెను. అతడు దాని పండ్లు వెదక వచ్చినప్పుడు ఏమియు దొరకలేదు. గనుక అతడు - ఇదిగో మూడేండ్ల నుండి నేను ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదకు వచ్చు చున్నాను గాని యేమియు దొరక లేదు; దీనిని నరికివేయుము. దీని వలన భూమియు ఏల వ్యర్థమై పోవలెనని ద్రాక్ష తోట మాలితో చెప్పెను. అయితే వాడు - అయ్యా, నేను దాని చుట్టు త్రవ్వి యెరువు వేయు మట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము; అది ఫలించిన సరి, లేని యెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను".

యేసు చెప్పిన ఈ ఉపమానములో అంజూరపు చెట్టు యూదా జనాంగమును, ద్రాక్షతోట యూదుల కీయబడిన ధన్యతలను, సూచించుచున్నవి. ఆ జనాంగము ఫలములు ఫలించవలెనని ప్రభువు యొక్క కోరికయై యుండెను. మూడేండ్ల నుండి దాని మీద పండ్లేమియు కనబడలేదని, అంటే చాల కాలము నుండి యూదులు నిష్ఫలులుగా యున్నారని ప్రభువు తన నిరుత్సాహాన్ని వెలిబుచ్చారు. గనుక దీనిని నరికి వేయుము. అంటే ఈ జనాంగము నాశనము చేయబడుననియు వారి ధన్యతలు అన్యుల కీయబడుననియు యేసు వారికి బోధించారు. అయితే తోట మాలి యేసు ప్రభువును సూచించు చున్నాడు. ఆయన మరికొంత కాలము మట్టుకు తన కృపను యూదుల యెడల కనబరచారు.

ఈ పాఠము నేరుగా ఆ నాడున్న యూదులకు వర్తించినను అది నేడు మనకు కూడ వర్తించుచున్నది. యూదా జనాంగముకంటె ఫలములు ఫలించుటకు మనకున్న అవకాశములు ఎక్కువ. వారి ధర్మశాస్త్రము ఛాయయేగాని, నిజస్వరూపము మనదైనది. వారు ప్రాతఃకాల వెలుగులో యుంటే మనం మధ్యాహ్న కాల సూర్య కాంతిలో యున్నాము. వారికి ప్రవక్తలు ఉపదేశిస్తే మనకు దేవుని కుమారుడే ఉపదేశించు చున్నాడు. వారు జంతు బలులర్పిస్తే, మనకు పరిపూర్ణయాగముగా క్రీస్తే అర్పింపబడ్డాడు. వారు దేవాలయములో ఆరాధిస్తే మనం సంఘములో ఆరాధన చేయుచున్నాము. అన్యజనులకంటె యూదులు అధిక్యత కలిగియుంటే, వారందరి కంటె మనకున్న అధిక్యత ఎక్కువ.

ఇన్ని విషయములలో ప్రభువు మనలను ఉన్నతులనుగా చేసినందున ఆయన మననుండి కోరే ఫలములు ఎక్కువ యని మనం గ్రహించాలి. మనము శ్రేష్టమైన మంచి ఫలములు ఫలించాలి. ఆత్మ ఫలములను ప్రభువు మన నుండి కోరుచున్నారు: "అయితే ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము సమాధానము దీర్ఘశాంతము దయాళుత్వము మంచితనము విశ్వాసము సాత్వికము ఆశానిగ్రము" అని గలతీ 5:22లో మనకు తెలియ జేయబడినది. "ఆ హేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త గలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. ఇవి మాకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అనుభవ జ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును" అని 2 పేతురు 1:5–8లో వ్రాయబడి యున్నది.

క్రీస్తు కొరకు ఫలములు ఫలించగల అవకాశముండియు ఫలించని వారందరు నరికి వేయబడుదురు. ఫలించని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును. అట్టివి అగ్నిలో పడవేయబడునని యేసు బోధించారు (యోహాను 15:2, 6). "ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడి యున్నది. గనుక మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును" అని కూడ ఆయన బోధించారు (మత్త 3:10).

అవిధేయత వలన యూదులు శిక్షింప బడ్డారు. నలువది సంవత్సరముల

మట్టుకు అరణ్య ప్రయాణం చేసి కానాను చేరుకో గలిగారు. ఆ తరువాత మరల బబులోను బానిసత్వానికి గురి అయ్యారు. క్రొత్త నిబంధనలో ఆసియాలోని ఏడు సంఘములు తమ బాధ్యతను సక్రమముగా నిర్వర్తించ లేదు. అందువలన ఆ ప్రాంతమంతయు ఇస్లాము మత పరమైనది. వ్యక్తి గత క్రైస్తవుడు ఫలములు ఫలించాలి. లేని యెడల అతడు నాశన మను భవిస్తాడు. నిష్ఫలమైన అంజూరపు చెట్టును నరికివేయు మని చెబితే తోట మాలి మరిం కొక సంవత్స రము మట్టుకు దాని కొరకు సమయ మడిగాడు. నిజానికి క్రీస్తు సిలువ వేయబడిన తరువాత యూదులకు ఇంచుమించు నలభై సంవత్సరములు సమయం ఇయ్యబడింది. కాని వారు మార్పు నొంద లేదు, క్రీస్తునను సరించి ఫలించ లేదు. సమయమను గ్రహించబడితే క్షమించ బడినట్లు లెక్క కాదు. "దుష్ క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగక పోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు." (ప్రసంగి 8:11). అందరు మారు మనస్సు పొందాలని ప్రభువు మన యెడల దీర్ఘశాంతము కలిగి యున్నాడు (2 పేతు రు 3:3-10). ఆయన దీర్ఘశాంతము చూపి నను మనము మారుమనస్సు పొందకపోతే మన కడవరిస్థితి మొదటి స్థితికంటె మరి చెడ్డదవుతాది (2 పేతురు 2:20).

నిష్ఫలమైన క్రైస్తవుని వలన ఈ భూమియు వ్యర్థ మవుతాది. "మిమ్మును బట్టియే గదా అన్యజనుల మధ్యను దేవుని నామము దూషింప బడుచున్నది?" యని పౌలు అడుగుచున్నారు. (రోమా 2:24).

దేవుని ఓర్పుకు కూడ పరిమితి ఉంటాది. ఆయన ఎంత కాలము మట్టుకు మన యెడల దీర్ఘశాంతము వహించగలడు? మనము మారుమనస్సు పొందే తరుణం యిదే. "భక్తి హీనులు తమ మార్గము విడువ వలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవాపై తిరిగిన యెడల ఆయన వారి యందు జాలి పడును" అని యెషయా 55:7లో వ్రాయబడి యున్నది. ప్రభువైన యేసు నామమందు విశ్వాసముంచండి, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందండి. మంచి ఫలములు ఫలించండి!!

- జాషువా గూటం

# సిలువ మీద

(On the Cross)

పాపము యొక్క దౌష్ట్యమును గూర్చి, దాని యెడల దేవుని తత్వమును గూర్చి కనుగొనాలంటే, దుష్టుల శిక్షణలో గాక శిష్టుల రక్షణలో కనబడునని నా యభిప్రాయం.

పాపము యెడల దేవుని ద్వేషం సొదొమ గొమొఱ్ఱాలను వెయ్యి అట్టి పట్ట ణాలను నాశనం చేయుటలో గాక కల్వరి లో నిజంగా కనబడుచున్నది. యిది పాపం యొక్క ఘోరకృత్యం. దేవుడు పాపాన్ని ఎంత ద్వేషించాడంటే తన ఏకైక కుమారుడు వచ్చి పాపమునకు ఏకైక జవా బిచ్చుటకు సిలువపై మరణించుటకాయన అనుమతి నిచ్చారు.

దేవుని యొక్క అపార ప్రేమను ఆయన నీ దైనందిన అవుసరాలను తీర్చు టలో గాక కల్వరిలో అపరాధి, కొరకు అమాయకుని బలి యిచ్చుటలో కనబడు నని నాయభిప్రాయం.

యేసు గెత్సెమనేలో ముమ్మారు చేసిన ప్రార్ధనకు సుముఖంగా జవాబీయ బడలేదు. ఆయన ఆగిన్నెను త్రాగ వల సిందే. గాని ఆయన ప్రార్ధనకు సుముఖంగా కూడా జవాబీయ బడింది. ఏలయనగా ఆ పాత్రను ఆయన త్రాగాలని దేవుని ఆదేశం. అందువలన దానిని త్రాగుటకు శక్తిని దేవుడు యిచ్చారు.

అందువలన గెత్సెమనేలో యేసు ఆ పాత్రను అంగీకరించారు. తాను మోయ వలసిన భారాన్ని ఆయన సమ్మతించారు. దేవదూతలు ఆయనకు పరిచర్య చేయుట లో దాన్ని భరించుటకు శక్తిని కనుగొన్నారు.

సిలువపై నుండి కనబడే మహిమాన్వి త దృశ్యం, మానవ చరిత్ర అంతటిలో మహిమాన్విత సమయం ఏమంటే యేసు ఘోరమైన బాధను అనుభవిస్తు కూడ, ఆయనను సిలువ వేసిన అవిశ్వాసులను భక్తిహీనులను చూచి, "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరె రుగరు గనుక వీరిని క్షమించుమని" ప్రార్ధించుటయే".

- గేరి మూర్.

# క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచెను !

(Christ Arose from the Dead !)

ఈ పాఠములో మనము యేసు క్రీస్తు యొక్క పునరుత్థానమును పరిశోధించబోవు చుంటిమి. ఏదైనా చరిత్రాత్మక ప్రతి పాదన యొక్క యధార్థ తను మనము నిర్ణయించునపుడు సాధారణముగ సాక్షుల దృష్టాంతములే మిక్కిలి విలువైన ఆధారములై యుండును. చారిత్రక పురుషులను మనము చూడలేక పోయిన ను వారిని గూర్చి వ్రాయబడిన సాక్ష్యముల వలన వారిని గూర్చి మనమెరుగుదుము. అలెగ్జాండరు చక్రవర్తిని గాని, అబ్రహామ్ లింకన్‌ను గాని, మహాత్మ గాంధీని గాని నేనెన్నడును చూడలేదు. అయితే వారిన చూచిన వారి దృష్టాంతములు మనకున్నం దున వారు ఒకానొక కాలమందు జీవించి న వ్యక్తులని నేనెరుగుదును.

అట్లే యేసుక్రీస్తు తిరిగి లేచిన తరువాత ఆయనను కంటితో చూచిన శిష్యులు లేకపోలేదు. 1 కొరింధి 15వ అధ్యాయములో పౌలు క్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చి చెప్పుచూ, ఆయన మొదట కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని, అటు పిమ్మట అప్పటికి జీవించియున్న 5 వందల మందికిని కన్పడినట్లు చెప్పెను. అంత మందిలో ఏ ఒక్కడయినను పౌలు చెప్పినది అసత్యమని ఖండించిన యెడల ఈ సమస్య అంతటితో తీరిపోయేది. మొదటి శతాబ్దములో ఎవరయితే క్రీస్తు శత్రువులని పరిగణింపబడిరో వారి మధ్యనే ఈ పునరుత్థాన వాస్తవమును అపొస్తలులు ధైర్యము బోధించిరి. ప్రజలు దానిని తిరస్కరించుటకు బదులు తండోప తండములగ క్రైస్తవులయిరి. ప్రజలలో అనేకులు, చివరకు యాజకులు కూడ క్రైస్తవుల యిరి. క్రీస్తు మృతులలో నుండి లేవని యెడల అంతమంది క్రైస్తవు లెట్లయిరి?

యేసుక్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచినట్లు నిరూపించు అనేక సంగతులు కలవు. అట్టి వానిలో మొదటిది మన ప్రభువు దినమని పిలువబడు 'ఆదివారమే'. చరిత్రలో ఏదైనా ఒక దినము కేటాయించబడిన యెడల అది ఒక గొప్ప సంగతిని సూచించును. (ఆగష్టు 15వ తారీఖు మన దేశపు స్వాతంత్ర్య దినమును సూచించును). దేవుడు ఏడవ దినమున తన పనినుండి విశ్రమించెను గనుక దానిని పరిశుద్ధపరచి ప్రతిష్ఠించెను. దేవుడు ఇశ్రాయేలీయులను

ఐగుప్తు నుండి బయటకు రప్పించెను గనుక వారికి సబ్బాతు ననుగ్రహించెను. అట్లే ఆదివార మునకు ఒక ప్రాముఖ్యత లేనిదే దానిని క్రైస్తవులు ఆచరించుట కూడ ప్రయోజనము లేనిదగును.

అయితే ఆదివారమునకు గొప్ప ప్రాముఖ్యత నొసగునది క్రీస్తు పునరుత్థానము. పునరుత్థానమునకు ముందు ఆదివారము ప్రత్యేకముగ ఆచరింపబడలేదు. ఆ దినముననే క్రీస్తు మరణము నుండి సజీవుడై లేచినట్లు లేఖనములు చెప్పుచున్నవి. ఆ తరువాత, శిష్యులు ఆ దినముననే ఆరాధన కొరకు కూడుకొని నట్లు మనము చూడగలము. మొదటి కొన్ని శతాబ్దములు యందంతటను ఈ అలవాటు ఉన్నట్లు సంఘ తండ్రులు, చరిత్రకారులు చెప్పుచున్నారు. నేడు కూడ క్రైస్తవులు క్రీస్తు యొక్క పునరుత్థాన మును గుర్తించుకొనుటకు ఆదివారమున కూడుకొనుట మనము చూడగలము. క్రీస్తు మృతులలో నుండి లేపబడకను, ఆ దినమునకు ప్రాముఖ్యత కల్పించకను ఉండిన యెడల ఈ 20 శతాబ్దముల తరబడి ఆచరించబడిన దానినేమని చెప్పగలము?

బాప్తిస్మమను క్రియను తరువాత ఋజువుగ మేము చూపించు చున్నాము. ఆయన పరలోకమున కెక్కిపోవకముందు యేసు తన శిష్యులకొక గొప్ప ఆజ్ఞ నిచ్చెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). రోమాలోని క్రైస్తవులను పౌలు ఇట్లు హెచ్చరించెను: "కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో, ఆలాగే మనము నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమయిన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము" (రోమా 6:4, 5). క్రీస్తు యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములకు బాప్తిస్మము సారూప్య మగ యున్నది. క్రీస్తు మరణించిన విధముగా ప్రతిమానవుడు తన పాపముల విషయమై మరణించవలెను, అనగా మారుమనస్సు నొందవలెను. క్రీస్తు భూమిలో పాతి పెట్టబడెను. గాని బాప్తిస్మములో ప్రతి మానవుడు నీటిలో పాతిపెట్టబడవలెను. క్రీస్తు తిరిగి లేచిన రీతిగ బాప్తిస్మము అను ఈ నీటి సమాధి నుండి ప్రతివాడు తిరిగి లేవవల

యును. క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేవని యెడల బాప్తిస్మమను క్రియలో కన్పడు పునరుత్థానమును గూర్చి యేమని మనము చెప్పుకొనగలము?

మానవుడు చిరకాలము జీవించాలనే కోరిక గలవాడు. చావు అనిన భయపడు వాడు మానవుడు. అనేక శతాబ్దముల వెనుక గోత్రకర్తయగు యోబు తన ఆశను ఈవిధముగ వెళ్ళబుచ్చెను : "ఒక మానవుడు మృతినొందిన యెడల అతడు తిరిగి బ్రతుకునా?". మానవుని ప్రకృతి అవసరములను తీర్చుటకు దేవుడు తగిన యేర్పాట్లు చేసెను. సహజముగా నేను ఆకలిగొందును. ఆకలి దీర్చుకొనుటకు దేవుడు నాకు ఆహారము ననుగ్రహించెను. నేను దప్పిగొందును, నా దప్పికను తీర్చుకొనుటకు దేవుడు నాకు నీరు ననుగ్రహించెను. మరణానంతరము జీవించవలెనని నాకు ఆశ కలదు. క్రీస్తు యేసునందు నిత్య జీవము నొసగుట ద్వారా దేవుడీ ఆశను తీర్చగలడ నుట సమంజసము కాదా? క్రీస్తు పునరుత్థానమే మన పునరుత్థాన వాగ్దానము.

"ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రధమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తు నందు అందరు బ్రదికింప బడుదురు. ప్రతి వాడును తన వరుస లోనే బ్రదికింపబడును; ప్రధమ ఫలము క్రీస్తు. తరువాత క్రీస్తు వచ్చినపుడు ఆయన వారు బ్రదికింపబడుదురు" అని 1 కొరింధి 15:20-23లో అపొ. పౌలు వ్రాసెను. 1థెస్స 4:13-17లో అతడు మరల ఇట్లు వ్రాసెను: "సహోదరులారా, నిరీక్షణ లేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టము లేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువును బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారి కంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి యుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండల మునకు మేఘముల మీద

కొనిపోబడు దుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటల చేత ఒకనినొకడు ఆదరించు కొనుడి".

క్రీస్తు మృతులలో నుండి లేవని యెడల మానవుని నిరీక్షణ సమాధి యొద్ద నే అంతమగును. ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము.

బైబిలు గ్రంధమునే మరొక ఋజువుగ మేము సమర్పించుచున్నాము. పునరుత్థానమును గూర్చి పాతనిబంధన భవిష్యత్తు చెప్పుచున్నది. క్రొత్త నిబంధన అది నెరవేర్చబడిన క్రియయని చెప్పుచున్నది. క్రీస్తు పునరుత్థాన కాలమందే క్రొత్త నిబంధన వ్రాయబడెను. అది ఏ ప్రదేశమందు ఏ ప్రజల మధ్య జరిగెనో అక్కడ వ్రాయబడెను. క్రీస్తు శిష్యులు అసత్యమును బోధించినను, లేక లిఖించినను ఆనాటి క్రీస్తు శత్రువులు వారి మాటలను సులభముగ తిరస్కరించి యుందురు. అట్లుగాక పునరుత్థానము ప్రకటింపబడెను. అది గ్రంధములలో వ్రాయబడెను. చివరకు క్రీస్తును చంపిన వారి మధ్యనే క్రీస్తు సంఘము నిర్మింపబడెను. క్రైస్తవ వ్యతిరేకులు పునరుత్థాన యధార్ధతల నంగీకరించి వారే పునరుత్థానమును ప్రకటింప మొదలిడిరి. అట్టి వారిలో అపొ.పౌలు ప్రధముడు.

క్రీస్తు పునరుత్థానమున కాధారమై యున్న బైబిలును నాశనము గావించుటకు ఎన్నో ప్రయత్నములు జరిగినను అది వాటన్నిటిని జయించి 19 వందల సంవత్సరములకు పైగా నిలచి యున్నది. దాని ప్రతులు వేలకు వేలు తగులబెట్ట బడినవి. దానిని చదువుచున్న కారణముగ అనేక స్త్రీ పురుషులు కాల్చబడిరి. అనేక హతసాక్షుల రక్తముతో దాని పుటలు మరకలు బడినవి. అయినను ఇంతకు ముందెన్నడును లేనంత పెక్కు సంఖ్యలలో, భాషలలో అది ఈనాడు లభించుచున్నది. బైబిలు బోధించు వర్త మానము సత్యము కానియెడల మానవాళి పై దాని ప్రభావము నెట్లు వర్ణింతుము?

క్రీస్తు సువార్తను మరొక ఋజువుగ మీకు సమర్పించుచున్నాము. సువార్త యనగా క్రీస్తు లేఖనముల ప్రకారము మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను, మూడవ దినమున లేపబడెను అను వాస్తవములు (1 కొరింధి 15:3, 4). క్రొత్త నిబంధన ఏమియు వ్రాయబడక ముందే ఈ వాస్తవములు ప్రకటింపబడెను. ఏ ప్రజలయితే క్రీస్తును సిలువవేసి చంపిరో, వారే వేలకు వేలుగ

పునరుత్థానుడైన క్రీస్తు నందు విశ్వసించి, బాప్తిస్మము పొంది క్రైస్తవు లయిరి. ఒకానొకప్పుడు క్రైస్తవులను హింసించిన పౌలు, "సువార్తను గూర్చి నేను సిగ్గుపడు వాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి...... రక్షణ కలుగ జేయుటకు అది దేవుని శక్తియై యున్నది" యని రోమా 1:16లో ప్రకటిం చెను. పునరుత్థానమును గూర్చిన వర్తమానములో నేటికింకను శక్తి యున్నది. ఈనాడు కూడ సువార్తను నమ్మి, బాప్తిస్మము పొంది వేలకొలది ప్రజలు క్రైస్తవు లగుచున్నారు.

పునరుత్థానమును గూర్చిన ఋజువులను మీకు అనేకము సమర్పించితిని. క్రీస్తు శత్రువులు ఆయన శరీరమును సమాధి నుండి తీసుకొనిపోలేదని మేము నిరూపించితిమి. శిష్యులు కూడ ఆయన శరీరము దొంగిలించలేదని తేటపరచబడినది. మనయొద్దనున్న విస్తారమైన ఋజువులను బట్టి క్రీస్తు మృతులలో నుండి లేచెనని మనము అంగీకరించవలసినదే. పునరుత్థానమును బట్టి ఆయన దేవుని కుమారుడని ప్రభావముతో నిరూపింపబడెను. అందుకే యేసు "నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పు లోనికి రాక మరణములో నుండి జీవము లోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అనెను" (యోహాను 5:24). మీరు నిత్యమూ జీవించాలని కోరుచున్న యెడల బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తులోనికి ఇప్పుడే రండి !!

- జాషువా గూటం.

# ఏలీ కుమారుల నుండి పాఠములు

(Lessons from the Sons of Eli)

ఇశ్రాయేలీయులను ఏలిన 15 మంది న్యాయధిపతులలో ఏలీ 14వ వాడు. 1 సమూయేలు గ్రంథము 2,3 అధ్యాయములు ఏలీ కుమారుల తత్వాన్ని మనకు బయలుపరచును. వారు 'బెలియాలు' కుమారులని అంటే పనికి మాలిన వారని చెప్పబడినది. వారు ఎందుకు పనికి మాలిన వారయ్యారో కనీసం మూడు కారణాలియ్యబడినవి. తత్ఫలితముగా వారి క్రియలు ఖండింప తగినవాయెను.

మొదటిగా, ఏలీ కుమారులు యెహోవను ఎరుగని వారు (1 సమూ2:12). ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనని వాడు ఆయన చిత్తము నెరుగడు దాని ప్రకారము చేయడు (యోహాను

7:17). దేవుని చిత్తమును నేర్పే బాధ్యత తలిదండ్రులదే (సామె 22:6). ఒకడు సత్యము నెరుగని యెడల అతడు స్వతం త్రుడెట్లు కాగలడు? (యోహాను 8:32). ఏలీ కుమారులు యెహోవాను ఎరుగని వారైరి గనుక ఘోరకృత్యము లు జరి గించిరి.

రెండవదిగా, ఏలీ కుమారులు దేవుని కర్పించు బలులను నిర్లక్ష్య పెట్టిరి (1 సమూ 2:13-17). బైబిలులో దేవుని ఆరాధనను నిర్లక్ష్యంగా చేసినవారు లేక పోలేదు. ఆదికాండము 4లో కయీను, లేవీకాండము 10వ అధ్యాయములో నాదాబు అబీహులు ఈ జాబితాలోని వారే. దేవుని చిత్తము నెరుగక పోయినప్పుడు ప్రతివాడును తన యిష్టాను సారముగా ప్రవర్తించెను (న్యాయా 17:6).

మూడవదిగా, ఏలీ కుమారులు అవినీతిపరులు (1 సమూ 2:22). వారికి ఆశానిగ్రహం అంటే యేమిటో తెలియ నట్లున్నది. వారు కామాతురత గలిగి దుష్కార్యములు చేసారు. వారు బహుశ విగ్రహారాధికులై యిట్టి నీచ కార్యములు చేసి యుండవచ్చును. వారు బహుశా పది యాజ్ఞలను పూర్తిగా మరిచి యుండ వచ్చును. నేటి మనలోకము టెలివిజన్, చలనచిత్రము, ఆధునిక సంగీతము, అశ్లీల సాహిత్యము మొ॥గు వాటి వలన కలుషితం చేయబడి యున్నది. అందుకే "మోసపోకుడి, దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపునని" పౌలు హెచ్చరిం చాడు. (1 కొరింథీ 15:33).

ఏలీ కుమారుల యొక్క అక్రమ ప్రవర్తనకొక కారణమున్నది. అదేమనగా, "తన కుమారులు తమ్మును తాము శాప గ్రస్తులగా చేసికొనుచున్నారని తానెరిగియు అతడు వారిని అడ్డగించ లేదు" (1 సమూ 3:13). పిల్లలను పెంచే గురుతర బాధ్యత తలిదండ్రులదే. అంటే వారిని క్రమశిక్షణలో యుంచాలి. వారికి కావలిసినదెల్లా చేయ రాదు, కావలసిన దల్లా ఇచ్చేయ నక్కర్లేదు. ప్రభువు యొక్క క్రమ శిక్షణలో పిల్లలను పెంచుటలో విఫల మైనప్పుడు (ఎఫెసీ 6:4), దేవుని కంటే మన పిల్లలనే ఎక్కువ ఘన పరచు వారమగుదుము (1 సమూ 2:29). అంటే దేవుని యెడల అపనమ్మకము కలిగిన వారమవుదుము.

తలిదండ్రులు యిచ్చు క్రమశిక్షణ నేడు అత్యవసరం. దుష్టత్వం జరిగించు టకు మనుష్యులు తొందర పడతారు (యిర్మి 17:9). ప్రపంచములో జరుగుచున్న అనేక దుష్కార్యములను గూర్చి వినడం, చూడడం వలన ఈ దౌష్ట్యము ఇంకా ఎక్కు వగు చున్నది. అందువలన కుటుంబ క్రమ

శిక్షణ అత్యవుసరం. అది దేవుని యెడల ను, మన పిల్లల యెడలను మన బాధ్యత అయ్యున్నది. ద్వితీ 6:3-9; 21:18-21; సామె 19:18, 23:13-14; 29:15,16; 22:6, ఎఫెసీ 6:4ను కూడ చూడండి. కుటుంబ క్రమశిక్షణ లేకపోతే తలి దండ్రులకు, పిల్లలకు, చివరకు దేశానికి నష్టమే (1 సమూ 4:11, 18, 22 లను చూడుము). తలిదండ్రులు బిడ్డలపై తగు క్రమ శిక్షణను అమలు పర్చాలి. పిల్లలు కూడ తలిదండ్రులను గౌరవిస్తు వారికి లోబడాలి. తలిదండ్రులు పిల్లలను ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచితే అదే పిల్లలు తమ తలిదండ్రు లను ఘనపరుస్తారు.

✍ - మేక్స్ పేటర్సన్

# యోగ్యముగా ఇచ్చుట

(Giving Worthily)

సార్దిస్‌లో యున్న కొందరు పరి శుద్ధ తెల్లని వస్త్రములధరించు కొని క్రీస్తుతో కూడ నడుతురు ఏలయనగా వారు అర్హులు (ప్రక 3:4). ప్రభువుకు మనం యేమి చేసినా దాన్ని యోగ్యముగా చేయాలి (1 కొరింథీ 11:27). మన పిలుపు నకు తగినట్టుగా మనం నడుచుకోవాలి (ఎఫెసీ 4:1). భౌతిక సంబంధమైన ఆశీర్వాదములలో కొంత భాగాన్ని తిరిగి దేవునికి యిచ్చుటలో యిది మరీముఖ్యం. దీనిని అతి ముఖ్యమైనదిగా మనం ఎంచాలి. యేసు ప్రభువు చెప్పిన అనేక ఉపమానాలలో ఆయన ఇచ్చుటను గూర్చి వక్కాణించారు. అవినీతి పరుడైన గృహ నిర్వాహకుడు, ధనవంతుడు లాజరు, బుద్ధిహీనుడైన ధనవంతుడు మొదలగు ప్రభువ చెప్పిన ఉపమానములు, అపొస్తలు లు చేసిన బోధలు దేవుడు మనమిచ్చిన ధనాన్ని సద్వినియోగం చేయాలనే బాధ్యతను మనకు నేర్పుచున్నవి.

2 కొరింధీ 8:1-15లో మనం యోగ్య ముగా ఎందుకు ఇయ్యాలో అయిదు కారణ ములను పౌలు తెలియ జేయచున్నాడు. అవి మొదటి శతాబ్దములో ఎంత ముఖ్యమో ఈ 21వ శతాబ్దములోను అంతే ముఖ్యము. మనం లోభత్వమునకు తావీయకుండుట మనకే మంచిది. లోభి, లోభత్వము అను మాటలు మంచివికావు. అవి అక్రమ ధనార్జ నను, దురాశను సూచించు మాటలు. దురాశ వలన ఒకడు నింపబడి దొంగతనమునకు, అబద్ధ మాడుటకు, వ్యభిచరించుటకు, చివరకు నరహత్యకు నడిపించబడును. క్రీస్తు

ద్వారా దేవుని కృప లేకపోతే మనం దురా శకు లోనై పోయేవారమే.

ఒకడు విశాల హృదయుడై ధారా ళంగా ఇచ్చువాడగునట్లు క్రీస్తు మార్గము నడిపించును. తనకు కలిగిన దానిని బీదల కును అనాధలకును ఇచ్చుటలో అతడు సంతోషించును. మనకు మనమే సంతో షంగా యుండా లంటే స్వార్ధపరులమగు దుము. గాని మనకున్న దానిని యితరు లతో పంచుకొని నప్పుడు ప్రేమ, సంతోష ములధికములగును. అట్లుండకపోతే మనం స్వార్ధపరులము, లోభుల మగు దుము. అశాంతి మనదగును.

1. యితరుల మాదిరిని బట్టి మనంయోగ్యంగా ఇయ్యాలని పౌలు చెబుతున్నాడు: మాసిదోనియలోని పరిశుద్ధులు మాదిరిని చూపిస్తు అకయ లోనున్న వారిని పౌలు పురికొల్పు చున్నాడు. వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను. "పేదలే పేదలకు సహాయం చేతురని" ఒకాయన అన్నారు. అంటే బీదతనం యేమిటో వారెరుగుదురు గనుక వారు ఒండొ రులకు సహాయపడ్తారు. బీదలు, సామాన్య ప్రజలే యేసు ప్రభువును ఎక్కువ వెంబడించారు. ధనవంతులైన వారిలో ఎక్కువ మంది ఆయనను తిరస్కరించారు. "లోక రీతిని జ్ఞానులైనను ఘనులైనను గొప్ప వంశము వారైనను అనేకులు పిలువబడలేదనుట" నిజమే (1 కొరింథీ 1:26).

ధనాన్ని ఉపయోగించే విధానమును బట్టి అది మేలైనా చేయగలదు, కీడైనా చేయగలదు. ధనం కలిగి యుండుట తప్పు కాదు. దాన్ని యితరులతో పంచుకొనక పోవడం తప్పు! లూకా 10:25-27లో మంచి సమరయుని గమనించుము. దొంగల బారిన పడిన వారికి సహాయ పడుటకతడు తన ధనాన్ని వినియోగించాడు. దేవుడు తమ కిచ్చిన ధనమును సంఘ సహాయార్ధం కొందరు వినియోగించుట నీవు చూచు నప్పుడు, నీవు కూడ వారి మాదిరి నను సరింప గలవు. పౌలుకు ఈసంగతి తెలుసు. అందుకనే కొరింథీయులను పురి కొల్పడా నికి మాసిదొనియ వారిని ఉదాహరణగా అతడు వినియోగించాడు.

2. "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా! ఆయన ధనవం తుడై యుండియు మీరు తన దారిద్ర్యము ము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడా యెను" (2 కొరింథి 8:9). ఇచ్చుట భూమి మీద కాదు గాని పరలోకంలో ఆరంభ మయ్యింది. "దేవుడు లోకమునెంతో

ప్రేమించి......................తన అద్వితీయ కుమారుని అనుగ్రహించెను" (యోహాను 3:16). ఆయన యిచ్చిన బహుమానం యేమిటి? అయన ఏకైక కుమారుడు!! యేసు తనకు తానే తన ప్రాణమును పెట్టెను (యోహాను 10:18). కావలెనంటే ఆయన 12 సేనావ్యూహాము లను పరలోకము నుండి రప్పించి తన్ను తాను రక్షించు కొనవచ్చును (మత్తయి 26:53). గాని ఆయన నశించిన శిధిలమై పోయిన మానవుని ప్రేమించారు. అట్టి వానిని రక్షించే దేవుని మార్గము ఆయన ఒక్కడే అని ఆయన ఎరుగును (రోమా 5:8). మన ప్రభువు యొక్క ఆశ్చర్యకరమైన దాతృత్వము ఉదారత మనం యోగ్యముగా ఇచ్చుటలో అగ్రస్థానము చేరు కొనునట్లు మనలను పురికొల్పాలి. సంఘము నొచ్చు కొనునంత మట్టుకు ఇయ్యడం నేర్చుకొంటేనే గాని లోకంలో నశించిన వారికి సువార్తకు అందియ్య లేము. మనం నొప్పి కలిగేటంత వరకు ఇస్తుయుంటే కొంతకాలానికి అది నొప్పి అనిపిం చదు ఏలయనగా అప్పటికి ధారాళంగా ఇయ్యడం నేర్చుకొని యుంటాము.

సువార్తికులను దూరప్రాంతములకు పంపడానికి, సువార్త కూటములు జరిపించ డానికి, వాక్యాన్ని ప్రకటించడానికి డబ్బు అవసరం. యేసు యొక్క ప్రేమకధ నలుమూలలా చాటించ బడాలి. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి గొప్ప ఆలయములు నిర్మించుకొని వాటిలో మిషనెరీలకు, సువార్తికులకు స్థానం కల్పించని సంఘము మృతిజెందుచున్నట్టివే. ఆలయములు నిర్మించుటలో తప్పులేదు గాని వాటిని నిర్మించుటలో సంఘము యొక్క అసలైన పనిని, అనగా ఆత్మల రక్షణను మరచితే వాటి ప్రయోజనం శూన్యం. మనం దేవుని పనికి ఇయ్యాలి. త్యాగపూరితముగా ఇయ్యాలి.

3. కొరింధులోని సంఘము యొక్క గతచరిత్రను వినియోగిస్తు వారు నమ్మకముగా యోగ్యముగా ఇయ్యాలని పౌలు హెచ్చరించాడు. వారు సంవత్సరము క్రిందటనే ఈ కార్యము చేయుట యందే గాక చేయ తలపెట్టుట యందును కూడ మొదటివారై యుండాలని పౌలు వారిని హెచ్చరించాడు (2 కొరింధీ 8:10). వారు మొదలు పెట్టిన దానిని ముగించం అత్యవసరం. మనం అనేక మంచి సంగతులను మొదలుపెట్టి ముగించడం గనుక విఫలమవుతాము. "నీ శ్రేష్టమైన స్థాయికి దిగువ జారిపోకు" అను మాట జ్ఞాపకం ఉంచుకోవాలి. గతంలో సాధించిన గొప్పవాటిపై ఆనుకొని విశ్రాంతి బొందుట మంచిదికాదు. గతంలో సాధించిన గొప్ప కార్యములను ప్రస్తుతపు అశ్రద్ధ కనబడకుండా చేస్తాది.

**4.సత్‌భావములను క్రియా రూపకం చేయడం ఉత్తమము.** మంచి కార్యము తలపెట్టుకు వారికున్న సిద్ధమైన మనస్సును బట్టి పౌలు వారిని అభినందించాడు (2 కొరింథీ 8:11). మనశక్తి సామర్థ్యములను బట్టి తరుణములను బట్టి దేవుడు మనకు తీర్పు తీర్చును, ఏలయనగా "శక్తికి మించి కాదుగాని కలిమికొలదియే యిచ్చిన ప్రీతికరము" (2 కొరింథీ 8:12). ఎవరు తమ విశ్వాసాన్ని జీవిస్తారో వారే మంచి బోధకులు. మంచి కార్యరూపం ధరిస్తే అదే అందరికి అవు సరం.

**5. జీవితం సంగతులను చదును చేస్తాది.** అన్యజనులు యూదులకు ఇప్పుడు భౌతికంగా సహాయం చేయుచున్నారు. యూదులకు మొదట సువార్త అందియ్యబడింది. దాన్ని వారు అన్యులతో పంచుకొన్నారు. యూరోపియన్ గ్రీసు దేశంలోని అన్యులు సంపన్న పరులు గాని యూదులు కరువు నెదుర్కొనుచున్నారు. అనేకులు యూదా మతాన్ని విడిచిపెట్టి క్రీస్తును అంగీకరించినందున హింసింప బడుచుండిరి. ఇప్పుడు ఇరువురు సమానముగా కనబడుచున్నారు. "హెచ్చుగా కూర్చుకొని వానికి ఎక్కువ మిగల లేద నియు తక్కువగా కూర్చుకొనిన వానికి తక్కువ కాలేదనియు వ్రాయబడిన ప్రకారము అందరికి సమానముగా ఉండు నిమిత్తము ప్రస్తుతమందు మీ సమృద్ధి వారి అక్కరకును మరి యొకప్పుడువారి సమృద్ధి మీ యక్కరకును సహాయమై యుండవలెను" (2 కొరింథీ 8:14-15).

"నీ ఆహారము నీళ్ల మీద వేయుము, చాల దినములైన తరువాత అది నీకు కనబడును" (ప్రసంగి 11:1). యేసు లూకా 6:38లో చెప్పిన మాటలను సొలొమోను తన శైలిలో చెప్పినట్లున్నది. "క్షమించుడి అప్పుడు క్షమింపబడుదురు; ఇయ్యుడి అప్పుడు మీకు ఇయ్యబడును; అణచి కుదిలించి దిగజారునట్లు నిండు కొలతతో మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలుతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడును".

ఇచ్చుటలో ఒకడు ఎన్నడు పేదవాడై పోడు, ఏలయనగా మనుష్యుడేమి విత్తునో దానినే కోయును. దేవుని మహోచితమైన కృపవలన మానవుడు అత్యధికముగా ఆశీర్వదించబడ్డాడు (కీర్త 37:25; రోమా 8:28; గలతీ 6:7).

✍ - బిల్ నిక్స్

# దేవుని నాయకులెవరు?

(Who Are God's Leaders?)

విశ్వాసుల సమాజములో దేవుని నాయకులను గుర్తింప వచ్చును. సంఘ పెద్దలు బోధకులు దేవుని ప్రముఖ నాయకులు. దేవుని పనిలో ఆయా రీతులుగ కృషి చేయు స్త్రీ పురుషులు కూడా నాయకులే. క్రీస్తు యొక్క పనిని సాధించడానికి ఇట్టి వారనేకులు మనకు అవుసరం . అట్టి నాయకుల లక్షణాలను బైబిలు నుండి గమనించుము.

దేవుని పరిశుద్ధులకు పరిచర్య చేయు నిమిత్తము తమ్మును తాము ఏర్పరచుకొన్నవారు దేవుని నాయకులు. స్తెఫను ఇంటివారు పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్మును తాము అప్పగించుకొనినవారు. అట్టివారికిని పనిలో సహాయము చేయుచు ప్రయాసపడుచు ఉండు వారికందరికిని విధేయులై యుండ వలెనని సంఘమంతటికి పౌలు హెచ్చరిక చేసెను (1 కొరింధీ 16:16). దేవుని నాయకులు ఆత్మీయ ప్రజలు. దేవుని వాక్యము వలన వారి జీవన దృక్పథము ఏర్పరచబడి యుంటాది. తప్పులో యున్న వారిని సరిజేయుటకును ఒకరి భారము లను ఒకరు భరించుటకును, ఇష్టపడు వారు దేవుని నాయకులు (గలతీ 6:1-3).

దేవుని నాయకులు ఐక్యతను కాపాడుట యందు శ్రద్ధ గలిగిన వారు. కోరహు వలెను దియొత్రెఫే వలెను వారు స్వార్ధపరులు కారు. సంఘాన్ని చీల్చువారు కారు. బర్నబావలె వారు ప్రోత్సాహ పుత్రులు, తార్సు వాడైన పౌలును అంగీ కరించవలెనని యెరూషలేము సంఘాన్ని బర్నబా ప్రోత్సాహించాడు. అతడు అంతి యొకయ సంఘాన్ని నెల కొల్పాడు. విశ్వాసముతోను పరిశుద్ధాత్మతోను నిండుకొనిన మంచి వాడతడని ప్రజలు ఎరుగుదురు. మార్కు నందు అతనికి కలిగిన విశ్వాసమును బట్టి అతన్ని ప్రోత్సహించాడు. దేవుని నాయకులు ఇట్టి వారే.

దేవుని నాయకులుగా యుండవలెనని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇక్కడ వర్ణించబడిన నాయకులకు లోబడాలని మిమ్మును ప్రేరేపించుచున్నాను. దేవుని నాయకులు ఐక్యతను శ్రద్ధగా కాపాడు ఆత్మీయ ప్రోత్సాహకులు. దేవుని పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు నిశ్చయించుకొనిన వారు. నీవు కూడా దేవుని నాయకుడవు కాగలవు.

✍ - డేన్ ఓవెన్.

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

## Declaration (See Rule 3)

| | |
|---|---|
| Titlle of the News paper | : Satya Vakku |
| Language | : Telugu |
| Name & Address of the Publisher | : Joshua Gootam |
| Nationality | : Indian |
| Name of the printer with address | : Joshua Gootam<br>10-4-33/1,<br>Seshagiri Rao St.,<br>Kakinada - 533 004. |
| Place of printing with address | : Satya Vani<br>Church of Christ,<br>7-9-35,<br>Sambamurthy St.,<br>Kakinada - 533 001. |
| Place of Publishing | : Satya Vani<br>Church of Christ,<br>7-9-35,<br>Sambamurthy St.,<br>Kakinada - 533 001. |
| Name of the Editor | : Joshua Gootam (Indian)<br>10-4-33/1,<br>Seshagiri Rao St.,<br>Kakinada - 533 004. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my kmowledge and belief.

Sd -
Joshua Gootam

# " సత్యవాక్కు "

సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా అనేక వేల గృహములను దర్శించు చున్నది. మరియు అనేక మంది ప్రతినెలా మాసపత్రికను కోరుచున్నారు. అట్టివారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా పంపించ వలెను. లేనియెడల సత్యవాక్కు పత్రిక పంపబడదు . మీకు సత్యవాక్కు క్రమముగా అందుచున్న యెడల మీ చందాను వెంటనే పంపండి. సత్యవాక్కు పత్రిక కాపీలు ఒకటికంటె ఎక్కువ మీకు అందుచున్న యెడల వాటి వివరాలు మాకు తెలియజేయండి.

*మీరు పాత చందా దారులైతే మీ సత్యవాక్కు సభ్యత్వపు నంబరును మీ M.O. ఫారమ్ పై తప్పక వ్రాయండి.*

– 'ఎడిటర్'


RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/02


From:


**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**


To


Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.